తాగునీటి ట్యాంక్ ఎక్కి రైతు నిరసన

-అటవీ శాఖ అధికారులు వేధిస్తున్నారని ఆరోపణ

ట్యాంక్ పైకి ఎక్కి నిరసన తెలుపుతున్న బాధితుడు శ్రీరాములు

భీమారం, జూలై 3 : అటవీ శాఖ అధికారులు వేధిస్తున్నారని ఆరోపిస్తూ మంచిర్యాల జిల్లా భీమారం మండలం ఇప్పల బో గుడకు చెందిన కోట శ్రీరాములు బుధవారం నీళ్ల ట్యాంకు ఎక్కి నిరసన తెలిపాడు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ.. 2003 సంవత్సరం నుంచి పోలంపల్లి శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 384/ 14లో ఐదు ఎకరాలు, 384/12లో ఐదు ఎకరాలు సాగు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ భూమి విషయమై అటవీశాఖ అధికారులు వేధిస్తున్నారని ఆరోపించాడు. దీనిపై రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సర్వే చేసి తన భూమికి హద్దులు తేల్చాలని కోరాడు. ఈ విషయంపై మంచిర్యాల రేంజర్ రత్నకర్‌రావును వివరణ కోరగా పోలంపల్లి శివారు ప్రాంతంలో శ్రీరాములు అక్రమంగా అటవీ ప్రాంతంలో చెట్లను నరికివేశాడని, ఇందుకు అన్ని సాక్ష్యాలున్నాయన్నారు. ఈ విషయాన్ని రాములు కూడా అంగీకరించాడని తెలిపారు. కేసు నమోదు చేస్తారనే భయంతోనే నీళ్ల ట్యాంక్ ఎక్కాడని తెలిపారు.

బొగ్గు బ్లాక్ సింగరేణికే కేటాయించాలి

రెబ్బెన, జూలై 3 : కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన బొగ్గు బ్లాకుల వేలంను రద్దు చేయాలని, రాష్ట్రంలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకు సింగరేణి సంస్థకు కెటాయించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిలి డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీలో బుధవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖైర్‌గూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, గోలేటి బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శులు అనంద్, శేషు, కిరణ్‌బాబు, చంద్రశేఖర్, దివాకర్, ఓదెలు, షకీల్, జనరల్ షిఫ్ట్ ఇంచార్జి కొటి లతో పాటు పలువురు ఉన్నారు.

ఖైర్‌గూడ ఓసీపీని సందర్శించిన సేఫ్టీ జీఎం

రెబ్బెన, జూలై 3 : బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీని బుధవారం బెల్లంపల్లి రీజియన్ జీఎం సేఫ్టీ రఘుకుమార్ సందర్శించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ఖైర్‌గూడ ఓసీపీలోని ఇన్ ఫిట్ క్రషర్ పరిశీలించిన అనంతరం రక్షణ ఏర్పాట్లు తనిఖీ చేసి క్షుణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఖైర్‌గూడ ఓసీపీ పీవో సత్యనారాయణ, పీఈ వీరన్న, గని మేనేజర్ ప్రవీణ్‌పాటింగ్ ఉన్నారు.

మిగులు విద్యుత్ విక్రయానికి ఒప్పందం

జైపూర్, జూలై 4 : సింగరేణి విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అయిన విద్యుత్ రాష్ట్ర అవసరాలకు పోను తెలంగాణ ఎస్ఎల్‌డీసీ వారి అనుమతితో బహిరంగ మార్కెట్‌లో విక్రయించేందుకు ఎన్‌టీపీసీ వ్యాపార్ నిగమ్ వారితో ఢిల్లీలో ఒప్పందం జరిగినట్లు సింగరేణి అధికార ప్రతినిధి బధవారం ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఈ ఒప్పంద పత్రాలను ఎన్‌టీపీసీ వ్యాపారనిగమ్ లిమిటెడ్ తరపున రేణునారంగ్, సింగరేణి కాలరీస్ తరపున ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణలు పరస్పరం మార్చుకున్నారు.

జీఎంకు వినతి

రెబ్బెన, జూలై 3 : బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి జీఎం కార్యాలయంలో బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ కు వినతిపత్రం అందించినట్లు టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు పేర్కొన్నారు.

పోరాటాల ద్వారానే బొగ్గు గనుల రక్షణ

కార్మిక సంఘాల సదస్సులో ప్రొఫెసర్ కోదండరాం

మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

మందమర్రి, జూలై 3 : సంఘటిత పోరాటాల ద్వారానే సింగరేణి బొగ్గు గనులకు రక్షణ ఉంటుందని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్‌అహ్మద్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బొగ్గు గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలోని బొగ్గు గనులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేటు శక్తులకు కట్టబెట్టడంలో భాగంగా తెలంగాణలోని సింగరేణి గనులను వేలం వేయడానికి కుట్ర చేస్తుందన్నారు. దేశంలోని గనులను వేలం వేయడం వేరు సింగరేణి గనులను ప్రైవేటు శక్తులకు అప్పగించడం వేరన్నారు. తెలంగాణలోని బొగ్గు గనులన్నీ సింగరేణి పర్యవేక్షణలోనే నడవాల్సి ఉండగా కేంద్ర ప్రభుత్వం వేలం వేయాలని కుటిల ప్రయత్నాలు చేయడం ఎంతవరకు సమంజసం కాదని ఆయన అన్నారు. ఈ ప్రమాదాన్ని అడ్డుకునేందుకు కార్మిక సంఘాలు ఏకం కావడం మంచి పరిణామని ఆయన అన్నారు. కార్మిక సంఘాలన్నీ సంఘటితంగా పోరాడి కేంద్రంలోని బీజేపీ నరేంద్రమోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపు నిచ్చారు. కేంద్రం కుట్రలను సింగరేణిలో అమలు కాకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత అన్ని సంఘాల పై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు టి.శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ప్రొఫెసర్ హరగోపాల్, విమలక్క, అనురాధ, కామెర గట్టయ్య, జక్కుల నారాయణ, బోసుబాబు, సీతారామయ్య, శ్రీనివాస్, రామన్న, పెద్దపల్లి సత్యనారాయణ, పార్వతి రాజిరెడ్డి, జే.శ్రీనివాస్, ఎర్ర శ్రీనివాస్ రెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

-మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, జూలై 3 : రోగులకు ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్య సేవలు అందించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణంలోని వంద పడకల దవాఖానలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వైద్యులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సమీకృత మార్కెట్ భవనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

కన్నెపల్లి, జూలై 3 : మొక్కలు నాటి సంరక్షించడం అందరి బాధ్యత అని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం భీమిని మండల కార్యాలయం నుంచి బుగ్గ మల్లన్న రహదారికి ఇరువైపులా వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెద్దపేటలోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పనులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల పరిసర ప్రాంతాల్లో ఉన్న అక్రమణలను తొలగించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం వెంకటాపూర్ పర్యటించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట ఎంపీపీ పోతురాజుల రాజేశ్వరి, జడ్పీటీసీ పోతురాజుల గంగమ్మ, ఎంపీడీవో గంగామోహన్, తహసీల్దార్ బికర్ణదాస్, ఏపీవో,పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

గనుల వేలాన్ని వ్యతిరేకిస్తూ రేపు కలెక్టరేట్ ముట్టడి

శ్రీరాంపూర్, జూలై 3 : సింగరేణి బొగ్గు బ్లాకులను వేలం ద్వారా ప్రైవేటీకరణను వెంటనే ప్రభుత్వం విరమించుకోవాలని ఈ నెల 5న సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంచిర్యాల కలెక్టరేట్ ముట్టడి ధర్నాకు కార్మిక వర్గం అధిక సంఖ్యలో తరలిరావాలని ఏఐటీయూసీ డిప్యూటీ పధాన కార్యదర్శి కే వీరబద్రయ్య కోరారు. బుధవారం శ్రీరాంపూర్ ఆర్కే న్యూటెక్ గనిపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి 60కోట్లు వెచ్చించి గనులను గుర్తిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ సంస్థలకు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వెంటనే గనులను సింగరేణికే కేటాయించాలని కోరారు. కార్మిక వర్గం గనుల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచి సహాయ కార్యదర్శి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, నాయకులు చంద్రమోహన్, బద్రి బుచ్చన్న, మోతె లచ్చన్న, సంపత్ పాల్గొన్నారు.

ఫ్లకార్డులతో నిరసన

లక్షెట్టిపేట, జూలై 3 : బొగ్గు బ్లాక్‌ల వేలం పాటకు నిరసనగా పట్టణంలోని అంబేత్కర్ చౌక్ వద్ద సీపీఎం, సీఐటీయు ఆద్వర్యంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు, ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేసారు. పార్టీ శ్రేణులు మాట్లాడుతూ బీజేపీ పార్టీ, అదేవిధంగా మన భారత ప్రధాని మోడీ ప్రైవేటీకరణ అనే దాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేసారు.

నల్ల జెండాలతో సీపీఎం నిరసన

కాసిపేట, జూలై 3 : కాసిపేట మండలంలోని సోమగుడెం(కే), మల్కేపల్లి గ్రామాల్లో సీపీఎం ఆధ్వర్యంలో బొగ్గు బ్లాక్ వేలం పాటను రద్దు చెయాలని, బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ బీజేపీ, మోడీ ప్రయివేటీకరణ విధానాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు కోరలు పికేసినా బీజేపీ, మోడీకి బుద్ధి రాలేదని, బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం శాఖ కార్యదర్శి సంకే రాజకుమారి, సిడం జంగు బాయి, సంకే లింగయ్య, సంకే ప్రణయ్ కుమార్, చాయ, చెన్నూరి శ్రీనివాస్, చిలుముల పోషం, సాపాట్ భాగ్య, పత్తిపాక మొగిలి, నాగమణి, సాపట్ మల్లేష్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గోలేటిటౌన్‌షిప్‌లో

రెబ్బెన, జూలై 3 : రాష్ట్రంలోని బొగ్గు బ్లాకులు సింగరేణి కే నామినేషన్ పద్ధతిపై కెటాయించాలని, కమర్షియల్ మైనింగ్ పేరిట వేలం వేయడాన్ని వెంటనే విరమించుకొవాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు డిమాండ్ చేసారు. బెల్లంపల్లి ఏరియా లోని గోలేటిటౌన్‌షిప్ బస్టాండ్ ప్రాంతంలో బుధవారం సాయంత్రం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో బొగ్గు బ్లాకుల వేలం నిలిపి వేయాలని తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే కెటాయించాలని నల్లజెండాలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటి ఉపాధ్యక్షుడు ధరావత్ మంగిలాల్, కేంద్ర కమిటి సభ్యుడు ఓరం కిరణ్, ఏరయా కార్యదర్శి వెంకటేశ్వర్లు, మాంతు సమ్మయ్య, నాయకులు ఉన్నారు.

బతుకు విలువ తెలిసింది

మాది కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలం గోలేటి. నాలుగెకరాల భూ పంచాయితీలో క్షణికావేశంలో కొట్టుకున్నం. రక్త సంబంధీకులే చనిపోయింద్రు. 2010లో ఈ ఘటన జరిగితే 2012లో శిక్ష పడింది. 12 ఏండ్లుగా పాలివాళ్లం ముగ్గురం జైలులో ఉన్నం. నాడు ఎకరం భూమి విలువ ఐదువేలు మాత్రమే. 20 వేల భూమి కోసం కొట్టుకొని జైలు పాలై జీవితాలు ఆగంజేసుకున్నం. ఇప్పుడు బతుకు విలువ తెలిసింది. ఎకరం భూమిప్పుడు రూ.10లక్షలు పలుకుతున్నది. జైలులో ఉండగానే, ఎవరి భూమిని పంచుకున్నం. ఇక మాకు భూ పంచాయితీల్లేవ్. గొడవలు అస్సలే పెట్టుకోము. ఐదేండ్లపాటు జైళ్లశాఖ పెట్రోల్ బంకుల్లో, కార్పెంటర్ పనిచేయడం వల్ల జైలు గోడల మధ్య ఉండే కాలం చాలావరకు తగ్గినట్టయింది. ఇక మా కుటుంబాలతో మంచి జీవితాన్ని గడుపుతం.

-బాలయ్య, స్వామి, నగేశ్, గోలేటి, రెబ్బెన మండలం, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా

ఆర్కే 7పై ఆరోగ్య సదస్సు

శ్రీరాంపూర్, జూలై 3 : కార్మికుల ఆరోగ్యం వారి కుటుంబానికి, సంస్థకు ఎంతో మఖ్యమైందని శ్రీరాంపూర్ హెల్త్ ఆఫీసర్, డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ఆర్కే 7గనిపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ శ్రీధర్, ఏఐటీ యూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, ఫిట్ కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

బెల్లంపల్లి, జూలై 3 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఎఫ్‌వో వివ్ ఆశీష్‌సింగ్ అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని గని షాఫ్ట్ ఆవరణలో డీఎఫ్‌వో మొక్కలునాటారు. మందమర్రి ఏరియా జీఎం మనోహర్, ప్రాజెక్ట్ అధికారి ఆర్.విజయ్‌ప్రసాద్, బెల్లంపల్లి ఎఫ్‌డీవో విజయ్‌కుమార్, ఎఫ్ఆర్‌వో సుభాష్, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఎస్‌వో పి.రాజు, ఫిట్ ఇంజనీర్ రాంబాబు, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి దాసరి తిరుపతి గౌడ్ పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రి, జూలై 3 : మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సింగరేణి మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఏ మనోహర్ అన్నారు. ఏరియాలోని కేకే 2 బంగ్లాస్ ఆవరణలో సింగరేణి సేవా సమితి అధ్యక్షురాలు ఏ సవిత ఇతర అధికారులతో కలసి బుధవారం ఆయన మొక్కలు నాటి వనమహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విద్యార్థికి జీఎం సన్మానం

శ్రీరాంపూర్, జూలై 3 : శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లో ఐటీ విభాగం ఎస్ఈ శ్రీనివాస్ కూతురు ఇంటర్ మీడియట్ ఎంఈసీలో 1000 మార్కులకు గాను 988 మార్కులు సాధించిన కుమారి గొల్లాల సంయుక్తను బుధవారం జీఎం సంజీవరెడ్డి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం ఏవీ రెడ్డి, ఏజీఎం మురళీధర్, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏరి యా సేఫ్టీ ఆఫీసర్ శ్రీధర్, డీజీఎం చిరంజీవులు, క్వాలీటీ ఇన్‌చార్జి వెంకటేశ్వర్‌రెడ్డి, పర్జేజ్ ఎస్ చంద్రశేఖర్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్‌గౌడ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కౌటాల, జూలై 3 : కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎస్ఐ మధూకర్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. లాటరీ, గిఫ్ట్, డబ్బులు వచ్చాయని ఫోన్ చేసి, ఓటీపీ అడిగితే చెప్పవద్దని సూచించారు. ఖాతా నుంచి డబ్బులు పోతే వెంటనే బ్యాంక్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట కళాశాల అధ్యాపకులు తదితరులున్నారు.

చింతలమానేపల్లి, జూలై 3 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్ఐ నరేశ్ అవగాహన కల్పించారు. వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు.

సిర్పూర్(యూ), జూలై 3 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ మాదవ్‌గౌడ్ విద్యార్థులకు సూచించారు. మండలకేంద్రంలోని కేజీబీవీ,తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహణ సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో స్వప్న,ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

జైనూర్, జూలై 3 : జైనూర్ మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై సైబర్ జాగృతి అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ సందీప్‌కుమార్ నిర్వహించారు. ఎవరైన ఏటీయం కార్డుల పై ఉన్న నంబర్లు అడిగిన, ఎవైన వాట్‌సాఫ్‌లో లింకులు పంపిన, మేయిల్‌కి ఎ లింకులు పంపిన వాటిని క్లిక్ చేయవ ద్దని అన్‌లైన్ మోసగాలతో జాగ్రతగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కాళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇది రుణ భారతం

న్యూఢిల్లీ, జూలై 3: భారత్.. అధిక రుణ భారాన్ని ఎదుర్కొంటున్నదని ఎన్‌సీఏఈఆర్ డైరెక్టర్ జనరల్ పూనమ్ గుప్తా అన్నారు. దేశ జీడీపీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు దాదాపు 82 శాతంగా ఉన్నట్టు చెప్పారు. అయితే చాలావరకు రుణాలు స్థానిక కరెన్సీ అయిన రూపాయల్లోనే ఉండటం, దేశ వృద్ధి రేటు కూడా ఆకర్షణీయంగా ఉన్న కారణంగా ఇప్పటికైతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎన్‌సీఏఈఆర్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో గుప్తా మాట్లాడుతూ.. మొత్తం అప్పుల్లో మూడింటా ఒక వంతు రాష్ట్రాలవని చెప్పారు. రాబోయే ఐదేండ్లలో రుణ భారం మరింతగా పెరిగేందుకు వీలుందన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ హామీ ఉండటం వల్ల రాష్ట్రాలపై పెద్దగా ప్రభావం పడకపోవచ్చన్నారు.

ఎన్నికల హామీలతో..

సాధ్యం కాని హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తున్న వివిధ పార్టీల వల్లే రాష్ట్రాల అప్పులు ఇంతలా పెరుగుతూపోతున్నాయని తక్షశిల ఇన్‌స్టిట్యూషన్ కౌన్సిలర్ ఎం గోవింద రావు ఈ సందర్భంగా అభిప్రాయపడటం గమనార్హం. గత ఏడాది ఆఖర్లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ సైతం పెద్ద ఎత్తున సబ్సిడీలు, సంక్షేమ పథకాలు, రుణ మాఫీ హామీలతోనే అధికారంలోకి వచ్చినది తెలిసిందే. ముందుగా చెప్పినట్టుగా ఈ హామీల అమలుకు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటుండగా.. తీవ్రంగా వేధిస్తున్న నిధుల కొరతనూ చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో ఎన్‌సీఏఈఆర్ చర్చలో పాల్గొన్న గోవింద రావు వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇదిలావుంటే 2022-23 నాటికి పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల అప్పులే మిగతా రాష్ట్రాలకన్నా ఎక్కువగా ఉన్నాయి. అయితే మున్ముందు ఈ జాబితాలో దక్షిణాది రాష్ట్రాల పేర్లూ ఉంటాయన్న అంచనాలు వస్తుండటం గమనార్హం.

10 లక్షల కోట్లకు దేశీయ ఆహార మార్కెట్

2030 నాటికి చేరుతుందని అంచనాలు

న్యూఢిల్లీ, జూలై 3: దేశీయ ఆహార సేవల పరిశ్రమ అంచనాలకుమించి రాణిస్తున్నది. 2030 నాటికి ఈ రంగం రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందని బెయిన్ అండ్ కంపెనీ, స్విగ్గీ సంయుక్తంగా 'హౌ ఇండియా ఈట్స్' పేరుతో విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే కస్టమర్లు 45 కోట్లకు చేరుకోనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం రూ.5.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నది. వచ్చే ఏడేండ్లలో ప్రతియేటా 10-12 శాతం మధ్యలో వృద్ధిని నమోదు చేసుకుంటుందన్న సర్వే.. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందని వెల్లడించింది.

- ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ విభాగం ప్రతియేటా 18 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నది.
- 2023లో 12 శాతంగా ఉన్న విని మయం 2030 నాటికి 30 శాతానికి చేరుకుంటుందన్న అంచనా.
- భారత్‌లో కంటే చైనాలో నాలుగు రెట్లు అధికంగా రెస్టారెంట్లు ఉన్నాయి.
- ప్రస్తుతం 32-34 కోట్లుగా ఉన్న ఆహార సేవల మార్కెట్ కస్టమర్లు..వచ్చే ఆరేండ్లలో మరో 11 కోట్లు పెరిగి 43 నుంచి 45 కోట్లకు పెరగనున్నారు.
- దేశవ్యాప్తంగా 50 నగరాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ సర్వేను రూపొందించింది.

ఇక పెద్దగా లాభాలుండవ్

దేశీయ స్టాక్ మార్కెట్లపై ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఎంఫ్ అంచనా

రాబోయే మూడేండ్లూ అంతంతమాత్రంగానే సూచీల కదలికలు

ముంబై, జూలై 3: రాబోయే మూడు సంవత్సరాలు మదుపరులకు ఈక్విటీ మార్కెట్లలో పెట్టిన పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రాబడులను అందించకపోవచ్చని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ ఆర్ జానకిరామన్ అంచనా వేస్తున్నారు. గడిచిన మూడేండ్ల మాదిరిగా దేశీయ స్టాక్ మార్కెట్లు తదుపరి మూడేండ్లు పరుగులు పెట్టకపోవచ్చని బుధవారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. కానీ ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే మాత్రం ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ మెరుగ్గానే ఉంటాయన్నారు. అయితే అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ ఆల్‌టైమ్ హైని తాకిన నేపథ్యంలో జానకిరామన్ అంచనా మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.

తొలిసారి 80వేలకు సెన్సెక్స్

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ మరో చారిత్రక స్థాయిని తాకింది. తొలిసారి 80,000 మార్కుపైకి వెళ్లింది. గరిష్ఠంగా 80,074.30 వద్దకు చేరింది. అయితే మదుపరుల అమ్మకాల ఒత్తిడితో రికార్డు స్థాయిని నిలుపుకోలేకపోయింది. అయినప్పటికీ 545.35 పాయింట్లు లేదా 0.69 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 79,986.80 వద్ద స్థిరపడింది. కాగా, కేవలం 3 నెలల్లోనే సూచీ ఏకంగా 5వేల పాయింట్లు పెరగడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 162.65 పాయింట్లు లేదా 0.67 శాతం ఎగిసి మొదటిసారి 24,286.50 వద్ద నిలిచింది. ఒకానొక దశలోనైతే 24,307.25 వద్దకు వెళ్లి ఇంట్రా-డే హైని నెలకొల్పింది.

లాభాల స్వీకరణ దిశగా..

ప్రస్తుతం మార్కెట్ వాల్యుయేషన్స్ అధికంగా ఉన్నాయన్న జానకిరామన్.. నిజానికి గత కొన్నేండ్లుగా ఆయా కంపెనీల ఆర్థిక ఫలితాలను మించి వాటి షేర్లు ట్రేడ్ అవుతున్నాయని చెప్పారు. అయితే ఇకపై మదుపరులు తమ పెట్టుబడులను తిరిగి తీసుకునే దిశగా అడుగులు వేయబోతున్నారన్నారు. సూచీలు జీవనకాల గరిష్ఠాల్లో ఉన్న వేళ లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు పెద్దపీట వేస్తారని చెప్తున్నారు. కాగా, స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున వస్తున్న ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో) పైనా స్పందించారు. కొత్తగా లిస్టింగ్ అవుతున్న సంస్థలు అందివచ్చిన సొమ్మును తెలివిగా వాడుకోవాలని సూచించారు. ఇదిలా వుంటే ఓ మల్టీక్యాప్ కొత్త ఫండ్‌ను ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఆఫర్ చేస్తున్నది. ఈ నెల 8న మొదలై.. 22న ముగుస్తుంది. ఒక్కో యూనిట్ రూ.10కి లభిస్తుంది.

రూ.445.43 లక్షల కోట్లకు..

బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో బుధవారం రూ.445.43 లక్షల కోట్లకు చేరింది. భారీ లాభాల నడుమ మదుపరుల సంపద రూ.4,45,43,642.29 కోట్లు (5.33 ట్రిలియన్ డాలర్లు)గా నమోదైంది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ 0.86 శాత0 చొప్పున పెరిగాయి. రంగాలవారీగా బ్యాంకింగ్ షేర్లు 1.75 శాతం లాభపడ్డాయి. ఆర్థిక సేవలు, టెలీకమ్యూనికేషన్స్, సర్వీసెస్, ఇండస్ట్రియల్స్, ఎఫ్ఎంసీజీ సూచీలు 1.55 శాతం నుంచి 0.81 శాతం వరకు పుంజుకున్నాయి. అదానీ పోర్ట్స్ షేర్ విలువ అత్యధికంగా 2.49 శాతం పెరిగింది. కొటక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్ షేర్లు ఆకర్షణీయ లాభాలను అందుకున్నాయి.

సెన్సెక్స్ హైలైట్స్

తేదీ	పాయింట్లు
07-02-2006	10,000
11-12-2007	20,000
26-04-2017	30,000
03-06-2019	40,000
03-02-2021	50,000
24-09-2021	60,000
11-12-2023	70,000
03-07-2024	**80,000**